గడ్డు పరిస్థితుల్లో డిస్పోజల్ వ్యాపారం

- గతంలో రోజువారీ టర్నోవర్ రూ.కోటిపైనే
- నేడు రూ.20 లక్షలకు పడిపోయిన వైనం
- వందకుపైగా షాపులు మూత
- వెయ్యిమంది కార్మికుల ఉపాధికి గండి
- ఇది కార్మికవాడలో డిస్పోజల్ వ్యాపారం దుస్థితి



కొనుగోలుదారులు లేక బోసిపోయిన డిస్పోజల్ రోడ్డు

ఆటోనగర్(విజయవాడతూర్పు): నిత్యం కొనుగోలుదారులతో కళకళలాడే డిస్పోజల్ రోడ్డు ప్రస్తుతం కళతప్పింది. వచ్చే వాహనం..పోయే వాహనం అన్నట్లు తెంపు లేకుండా వాహనాల రాకపోకలు ఉండేవి. కార్మికవాడలో డిస్పోజల్ వ్యాపారం (పాతలారీల స్పేర్‌పార్ట్స్) మూడుపువ్వులు..ఆరు కాయలుగా ఉండటంతో వేలాది మంది కార్మికులకు ఉపాధి దొరికేది. వ్యాపారులు కూడా సంతోషంగా ఉండేవారు. కాని ఏడాదిగా పరిస్థితులు మారిపోయాయి. ఈ వ్యాపారాలు సాగకపోతుండటంతో వ్యాపారులు దుకాణాలను బంద్ చేస్తున్నారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు.

సంక్షోభంలో వ్యాపారం..

ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన జవహర్ ఆటోనగర్‌లో 45ఏళ్లుగా ఈ డిస్పోజల్ వ్యాపారం కొనసాగుతోంది. ఏడాది కాలంగా పాతలారీల స్పేర్‌పార్ట్స్ వ్యాపారం సరిగా లేకపోవడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో ఈవ్యాపారం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వ్యాపారం సరిగా లేకపోవడంతో ఇక్కడ ఉన్న సుమారు 500లకు పైగా డిస్పోజల్ షాపుల్లో 100 షాపులు ఇప్పటికే మూతపడటం పరిస్థితి అద్దంపడుతోంది. వ్యాపారాలు సాగకపోతుండటంతో పెట్టుబడి నిమిత్తం తీసుకువచ్చిన అప్పులు సైతం తీరే పరిస్థితులు కనిపించక పలువురు వ్యాపారులు ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోతున్నారు. దీంతో సుమారు 1000మందికిపైగా కార్మికులకు ఉపాధికి గండిపడుతోంది.

ఇక్కడ దొరికే వస్తువులివే...

లారీలకు సంబంధించిన స్పేర్‌పార్ట్స్‌లు ఇక్కడ సరసమైన ధరలకు లభిస్తాయి. ఇందులో భాగంగా ఇంజిన్‌ల స్పేర్‌పార్ట్స్, అండర్‌పార్ట్స్, గేర్‌బాక్సులు, సుజింగ్‌క్రేన్లు, కమాన్‌కట్టలు, క్యాబిన్ ఫాపార్ట్స్, లారీబాడీకి చెందిన పార్ట్స్, కమాన్ ప్లేట్‌లతోపాటు ఒగ్గీలు, కమాన్ బోగీస్, అబ్బులు, డ్రమ్‌లు, హజింగ్ యాక్సెస్‌లు, జాయింట్ బాడీలిఫ్ట్‌లు, ఇంజిన్ కూలింగ్ రేడియేటర్స్, డ్రాలింగ్ రాడ్స్, గేర్‌రాడ్స్, క్లచ్‌ప్లేట్స్, బ్రేక్ షూష్, ఇంజిన్ ఫైరింగ్ నాజర్స్, ఫిస్టల్స్, ఇంజిన్ బ్లాక్‌లు, హెడ్స్‌తోపాటు పలు రకాల వస్తువులు ఇక్కడ తక్కువ ధరకే దొరుకుతాయి. షోరూంలో దొరకని వస్తువులు సైతం ఇక్కడ సరసమైన ధరలకు లభిస్తుంటాయి.

ఇతర రాష్ట్రాలకు సైతం రవాణా..

ఇక్కడ డిస్పోజల్ వస్తువులు వేరే రాష్ట్రాలకు పంపిస్తారు. ఎక్కువగా మనదేశ రాజధాని ఢిల్లీకి సరుకు వెళ్తుందని వ్యాపారులు చెబుతున్నారు. ముంబై, గుజరాత్‌లోని జామ్‌నగర్, అహ్మదాబాద్, కర్నాటకలోని బెంగళూరు నగరాలతోపాటు ఒడిస్సా, తమిళనాడుతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాలకు

డిస్పోజల్ వస్తువులను తరలిస్తుంటారు.

నాడు రోజుకు రూ.కోటికి పైగా టర్నోవర్..

ఒకప్పుడు డిస్పోజల్ లారీ విడిభాగాల అమ్మకాలు రోజుకు రూ.కోటికి పైగా సాగేవి. ప్రస్తుతం ఈ వ్యాపారం టర్నోవర్ రోజుకు రూ.20 లక్షలకు పడిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు. ఏడాదిగా వ్యాపారాలు సాగక పెట్టుబడులకు వడ్డీలు సైతం కట్టలేని పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే షాపుల అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంటుందని ఆందోళన చెందుతున్నారు.

నేడు కొనేవారు కరువు..



ఎండలో మగ్గిపోతున్న డిస్పోజల్ సామాన్లు ఇవే

గతంలో డిస్పోజల్ వస్తువులకు మంచి గిరాకి ఉండేది. సంవత్సర కాలంగా కొత్తలారీలు కొనుగోళ్లు తగ్గిపోవడం, బాడుగలు లేకపోవడంతో డిస్పోజల్ వస్తువులకు గిరాకి పడిపోయింది. ఇక్కడ లారీకి సంబంధించిన (అసెంబ్లీ.. పాత వస్తువులు) పుష్కలంగా దొరుకుతాయి. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన లారీ యజమానులు ఇక్కడకు వచ్చి పాత స్పేర్‌పార్ట్స్‌ను కొనుగోలు చేస్తుంటారు. దీంతో నిత్యం కొనుగోలుదారులు, కార్మికులతో కళకళలాడే డిస్పోజల్ రోడ్డు ప్రస్తుతం కళాహీనంగా మారింది. ఇకనైనా పాలకులు స్పందించి కట్టడాలు, నిర్మాణాలు, కాంట్రాక్టు పనులను ప్రారంభిస్తే తప్ప తమ వ్యాపారం కోలుకోలేదని వ్యాపారులు చెబుతున్నారు. ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యాపారాలు లేవు...

ఆటోనగర్‌లో పనులు లేవు. చాలా గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం షాపుల అద్దె కూడా రాని పరిస్థితి. ఇక్కడ వ్యాపారాలు లేక ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. గతంలో ఎన్నడూ ఈ దుస్థితిని చూడలేదు.

– హబీబ్‌ఖాన్, వ్యాపారి, ఆటోనగర్



లారీ సరుకు కూడా వెళ్లడంలేదు...

డిస్పోజల్ సరుకు అమ్మకాలు బాగా పడిపోయింది. గతంలో ఢిల్లీకి వారానికి కనీసం మూడు లారీల సరుకు పంపించేవాళ్లం. ఇప్పుడు నెలకు కేవలం ఒక లారీని కూడా పంపించలేని దుస్థితి. దీంతో లారీల కిస్తీలు కూడా కట్టలేకపోతున్నాం.

– మల్లిక్, ట్రాన్స్‌పోర్టు యజమాని, ఆటోనగర్

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఈ ఏడాది ఎండలు తీవ్రరూపంగా ఉన్నందున, ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు చలివేంద్రాలు ఏర్పాటుకు ముందుకు రావాలని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ అన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని శ్రీఅభయ హస్త సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత అభయ హస్త అయ్యప్పస్వామి వారి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అవినాష్ మాట్లాడుతూ అయ్యప్పస్వామివారి దీవెనలు ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రార్థించారు. అనంతరం స్థానికులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలందరూ ఒకరిపై ఒకరు ప్రేమ, ఆదరణ భావం కలిగి జీవించాలని పీజే స్టీఫెన్ పాల్ మినిస్ట్రీస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పీజే స్టీఫెన్‌పాల్ అన్నారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన లైఫ్ ఛేంజింగ్ రివైవల్ ఉజ్జీవ ప్రార్థనల్లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను కోల్పోయి స్కూల్ ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్న 50 మంది పేద విద్యార్థులకు ఫౌండేషన్ తరపున ఆర్థిక సాయం అందజేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



పటమట(విజయవాడతూర్పు): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు వారి నైపుణ్యాలను కూడా మెరుగుపరచుకోవాలని పటమట ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య సూచించారు. పటమట పోస్టల్ కాలనీలోని స్కూల్లో సైన్స్ స్పార్క్ ఎస్2 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌రంగంలో నిత్యం నూతన ఆవిష్కరణలు వస్తుంటాయని, వాటిని అవగతం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన ఆయా ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. న్యాయనిర్ణేతగా ఎన్ఆర్ఐ అకాడమీ బోటనీలెక్చరర్ కె. సురేష్ రాజు వ్యవహరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.తుషార, అకాడమిక్ కోఆర్డినేటర్ లక్ష్మణరావు, హరిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు తాపడం పనులకు రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ ఎల్‌బీ.నగర్‌కు చెందిన మెరుగు గోపాల్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసిన దాతలు రూ.లక్ష విరాళాన్ని బంగారు తాపడం పనులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఈఈ కోటేశ్వరరావు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మతి స్థిమితం లేని వివాహిత అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతి స్థిమితం లేని వివాహిత అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఘటనపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా సారవకోట బద్రి గ్రామానికి చెందిన బలగ రమణయ్య, పద్మలు భార్యాభర్తలు. జీవనోపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. 12వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో భార్యాభర్తలిద్దరూ నిద్రపోయారు. రెండు గంటల సమయంలో రమణయ్యకు మెలుకువ వచ్చి చూడగా పద్మ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

17న ఉచిత కంటి వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని ఆయాన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 17న భవానీపురం స్వాతీ సెంటర్ మసీదు రోడ్‌లోని రజా మసీదు ప్రాంగణంలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ ఆఫీస్ వద్ద ఉచిత నేత్ర వైద్య సేవా శిబిరం నిర్వహించనున్నట్లు ఆ హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వీ రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో హాస్పిటల్ చీఫ్ వైద్యులు బషీర్ అహ్మద్ తన వైద్య సిబ్బందితో అధునాతన వైద్య యంత్ర పరికరాలతో కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. మందులు, ఐ డ్రాప్స్ ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. భవానీపురం నివాసితులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేత్రపర్వంగా పద్మావతి కల్యాణం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాలక్ష్మీ జన్మనక్షత్రమైన ఉత్తరఫల్గుణి నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శాశ్వత ఉభయదాతల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పీ రామ చంద్రమూర్తి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

కన్నులపండువగా గరుడోత్సవం..

పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి వారి గరుడోత్సవాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను గరడ వాహనంపై అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని ఆలయంలో మూడుసార్లు ప్రదక్షిణగా ఊరేగించారు.

'గరిమెళ్ల'కు ఘననివాళి



విజయవాడకల్చరల్: అన్నమయ్య కీర్తనలను గానాభిషేకం చేసిన మహనీయుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అని పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు కొనియాడారు. క్రామెడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీపీఠం, బ్రహ్మానందరావు కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సకల కళావేదిక కార్యాలయంలో శుక్రవారం గరిమెళ్ల సంస్మరణ సభను నిర్వహించారు. గరిమెళ్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ అన్నమయ్య పదం పల్లెపల్లెకు చేరడంలో గరిమెళ్ల కృషి కారణమన్నారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు మాట్లాడుతూ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌తో అనుబంధం గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చిట్టిబాబు, డేవిడ్‌రాజు, వెన్నా వల్లభరావు, డాక్టర్ గుమ్మాసాంబశివరావు, యోకోబ్, బీవీ వీరభద్రరావు తదితరులు పాల్గొని గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు నివాళులర్పించారు.

విజయలక్ష్మికి ఘనసత్కారం



విజయలక్ష్మిని సత్కరిస్తున్న సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి సామాజిక సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత ఐవోసీ అధికారి బీవీ వీరభద్రరావు అన్నారు. ఇటీవల విశిష్ట మహిళా పురస్కారాన్ని అందుకున్న విజయలక్ష్మికి సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాయలంలో శుక్రవారం అభినందనసభ నిర్వహించారు. ఈసందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ విజయలక్ష్మి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 18 వందలకు పైగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం ద్వారా సేవలను అందిస్తునట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, కే డేవిడ్‌రాజు, పైడిపాటి వెంకన్న, మల్లీశ్వరి, ఝాన్సీ, చలపతి, చంద్రశేఖర్, సునీల్, ఆదాం తదితరులు విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. సన్మానగ్రహీత విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం మరింత కృషిచేస్తానని వివరించారు.

'ప్రయాణం' గ్రంథావిష్కరణ



ప్రయాణం (యాత్రా సాహిత్యం) గ్రంథావిష్కరణలో పాల్గొన్న అతిథులు

విజయవాడ కల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. జాషువా సాహిత్యవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ నూకతోటి రవికుమార్, అజయ్ మేడేపల్లి, కాసుల రవికుమార్, మల్లవరపు ప్రభాకరరావు సంయుక్తంగా రచించిన 'ప్రయాణం' యాత్రా సాహిత్యం గ్రంథాన్ని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సాహిత్యంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. రచయితలు నలుగురు తమ సాహిత్య జీవితానికి సంబంధించి వారు ఎదుర్కొంటున్న సంఘటనలు, సాహితీవేత్తలతోపాటు ఇతర ప్రాంతాలను దర్శించిన సందర్భాలకు అక్షర రూపమిచ్చినట్లు వివరించారు. యాత్రా సాహిత్యం ప్రధానంగా వారి సాహిత్యజీవనానికి సంబంధించిన అనేక విషయాలను వివరించినట్లు తెలిపారు. యువ కవి అనిల్ డ్యాని మాట్లాడుతూ రచయితల కృషిని అభినందించారు. తొలి ప్రతిని సాహితీవేత్త కె.శోభారాణి స్వీకరించారు. గ్రంథాన్ని కథా రచయిత డాక్టర్ జడ సుబ్బారావు సమీక్షించారు. వివిధ రంగాలకు చెందిన కేవీ కృష్ణయ్య, వి.వెంకటేశ్వరరావు, గద్దం సుబ్బారావు, శిఖా ఆకాష్ ప్రసంగించారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి : కలెక్టర్



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందజేస్తున్న కలెక్టర్ ఎంపీ కేశినేని శివనాథ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు) : విభిన్న ప్రతిభాంతులు కన్న కలలను సాకారం చేసుకోడానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందజేయడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(అలింకో) సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్స్, ట్రైసైకిల్స్, కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ల్లా కలెక్టర్ లక్ష్మీశ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, వీల్ చైర్స్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తానని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రతి మూడునెలలకు ఒకసారి కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. విజయవాడ సెంట్రల్, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలోని 750 మంది విభిన్నప్రతిభావంతులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అలింకో సంస్థ ప్రతినిధి రవిశంకర్, నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంగీత కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న లలితా చంద్రశేఖర్, వాద్య సహకారం అందిస్తున్న బీవీ దుర్గాభవాని, శ్రీధర్

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాహిత్య సేవాసంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం నిర్వహించిన కర్నాటక గాత్ర సంగీత సభ సుమధురంగా సాగింది. గాయని లలితాచంద్రశేఖర్ శ్రీరాగం వర్ణంతో ప్రారంభించి ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన గణపతే, హిరణ్మయీం లలితాం, ఓగిరాల వీరరాఘవశర్మ రచించిన నేడే ననుసేవింప, త్యాగరాజస్వామి కీర్తన బ్రోచేవారెవరే, అన్నమాచార్య సంకీర్తన ధర్మవతి, జయదేవుని అష్టపది అనిల తరళ, రామదాసు కీర్తన రామభద్ర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవానీ, మృదంగంపై మంగళగిరి శ్రీధర్ వాద్య సహకారం అందించారు. స్వరఝరి సంస్థ అధ్యక్షులు తాడిమేటి సీతారామచంద్రమూర్తి సంతాప సభను కూడా ఇదే వేదికమీద నిర్వహించారు. సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ రామచంద్రరావు సంస్థకు చేసిన సేవలను వివరించారు. అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్ కోర్టు ప్రారంభం



పికిల్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎంపీ.కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక సిద్ధార్థనగర్‌లో ది పికిల్‌బాల్ రిపబ్లిక్ పేరుతో ఏర్పాటు చేసిన పికిల్‌బాల్ కోర్టును విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ అమరావతి పరిధిలో ఇలాంటి క్రీడా కోర్టులు మరిన్ని రానున్నాయని తెలిపారు. అమరావతిలో 220 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీని తమ ప్రభుత్వం నిర్మించనున్నట్లు చెప్పారు. స్పోర్ట్స్ సిటీ అంటే కేవలం మైదానాలు నిర్మాణమే కాకుండా అందులో నిష్ణాతులైన క్రీడా కోచ్‌లు, ఫిజియోథెరపిస్ట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంత యువకులకు, విద్యార్థులకు మెరుగైన క్రీడా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో పికిల్‌బాల్ క్రీడకు ఆదరణ పెరిగిందన్నారు. పికిల్ బాల్ కోర్టు నిర్వాహకురాలు డాక్టర్ వడ్లమూడి స్రవంతి మాట్లాడుతూ ఎనిమిది లేయర్స్ అక్రిలిక్ 4కోర్టులు, ప్రీమియం పాడిల్స్‌తో విశాలమైన ప్రాంతంలో పూర్తిస్థాయి సదుపాయాలతో ఈ కోర్టును ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నగరంలోని ప్రముఖులతో పాటు పికిల్‌బాల్ క్రీడాకరులు పాల్గొన్నారు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని దేవస్థాన ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ 8 కిలోమీటర్ల మేర సాగింది. శుక్రవారం తెల్లవారుజామున 5–55 గంటలకు ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్లు కొలువు తీరగా, ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదిదంపతులు కొలువై ఉన్న వాహనంతో పాటు దేవస్థాన ప్రచార రథానికి ఆలయ డీఈఓ రత్నరాజు, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి ఊరేగింపును ప్రారంభించారు.

కనుల పండువగా ఊరేగింపు

కామధేనుఅమ్మవారి ఆలయం నుంచి కుమ్మరిపాలెం, విద్యాధరపురం నాలుగు స్తంభాలు, సితారా జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కేటీరోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రహ్మణవీధి మీదుగా స్వామివార్ల ఊరేగింపు ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. పెద్దఎత్తున భక్తులు అమ్మవారి ఊరేగింపులో ముందుకుసాగారు. సాధారణంగా ప్రతి పౌర్ణమికి ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఊరేగింపు 9.30గంటలకు పూర్తవుతుంది. అయితే శుక్రవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు ఆలయానికి చేరుకునే సరికి 11గంటలైంది. ఊరేగింపు అనంతరం ఘాట్‌రోడ్డు వద్ద ఆది దంపతులకు పూజ నిర్వహించడంతో ఉత్సవం పరిసమాప్తమైంది.





హోలీ.. రంగోలీ..





విజయవాడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో హోలి పండుగ సందర్భంగా యువత, చిన్నారులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ